క్లుప్తంగా

విద్యార్థికి 'చారిటీ బాక్స్' చేయూత


విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న చారిటీ బాక్సు సభ్యులు

బీచ్‌రోడ్డు: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న డిగ్రీ విద్యార్థికి చారిటీ బాక్స్ సంస్థ చేయూత అందించింది. వివరాలివి.. మణికీర్తన్ ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. అతడి తండ్రి వెంకటరావు సైకిల్‌పై టీ అమ్ముతూ కుటుంబాన్ని పోషించేవారు. ఆయన ఇటీవల లారీ ఢీకొనడంతో మృతి చెందారు. దీంతో మణికీర్తన్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న సంస్థ ప్రతినిధులు మణికీర్తన్‌కు సోమవారం రూ.36 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దొలురు శంకరరావు, తాడికొండ కరుణాకర్, శ్రీనివాసరావు, లక్కోజు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ పోస్టర్‌ను బీసీ జోనల్ ఇంచార్జి డాక్టర్ తుళ్లి చంద్రశేఖర్ యాదవ్ ఏయూలో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించే క్రీడా పోటీల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. క్రీడ ల్లో పాల్గొనేవారు తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఐదు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ఈ పోటీలు జరుగుతాయని, యువత ఉత్సాహంగా పాల్గొనా లని కోరారు.

ఆరోగ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని జాతీయ ఆరోగ్యకార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. సోమవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఇతర కేసులు, ఆరోగ్యశ్రీ కేసులపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై సమాచారం ఉంటే ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్(డిఐఒ) డాక్టర్ జీవన్ రాణి మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు, చిన్న పిల్లలకు నిమోనియా, ఇతర వ్యాధుల మీద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరావు, ఆరోగ్యశ్రీ మేనేజర్ సత్య శ్రీనుబాబు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి జి.పూర్ణేంద్రబాబు, ఇతర వైద్యులు సత్యవాణి, తులసి, శశిభూషణ్‌రావు, నాగభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్ఏఎస్ 333 వార్షికోత్సవం

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో నేవల్ ఎయిర్ స్క్వాడ్రన్(ఐఎన్ఏఎస్) 333 ఈగల్స్ 43వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ హెలికాప్టర్ 1980లో ఇండియన్ నేవీలో చేరింది. 2000 సంవత్సరం నుంచి విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాలో సేవలందిస్తోంది. ఐఎన్ఏఎస్ 333 నేవీలో చేరి 43 ఏళ్లు అయిన సందర్భంగా ఐఎన్ఎస్ డేగాలో నేవీ అధికారులు కేక్ కట్ చేశారు.


పార్కులో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం


డాల్ఫిన్స్ ఫౌంటెయిన్ సముదాయం

అబ్బురపరిచే... ఆహ్లాదం

- ఆకర్షణీయంగా శివాజీపార్కు అభివృద్ధి
- రూ.1.5 కోట్లతో సుందరీకరణ పనులు
- రూ.50 లక్షలతో ఫౌంటెయిన్స్ సముదాయం పునరుద్ధరణ



అబ్బురపరిచే ఆహ్లాదానికి వేదికగా నిలుస్తోంది నగరంలోని శివాజీపార్కు. ఒకప్పుడు విరిగిన బెంచీలు, శిథిలమైన ఫౌంటెయిన్ల సముదాయం, నిరుపయోగంగా మారిన టాయిలెట్స్, తుప్పపట్టిన విద్యుత్ స్తంభాలకు కేరాఫ్‌గా నిలిచిన ఈ పార్కు ప్రస్తుతం ఊహలకందని సౌందర్యం సొంతం చేసుకుంది. మిరుమిట్లు గొలిపే కొత్త సొబగులతో సందర్శకులను కట్టిపడేస్తోంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ పార్కు ఆధునీకీకరణకు జీవీఎంసీ ఊపిరిపోయడమే ఇందుకు కారణం. నగర వాసులకు మానసిక ప్రశాంతతను, ఆహ్లాదాన్ని పంచే విధంగా ప్రభుత్వ ఆదేశాలతో ఈ పార్కు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ మేయర్ హరివెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు శివాజీ పార్కు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు రూ.2 కోట్ల వ్యయంతో సుందరీకరించారు. రూ.1.5 కోట్లతో అభివృద్ధి, మౌళిక వసతులు కల్పించారు. పార్కు ముఖద్వారం, ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా ఫొటోషూట్ పాయింట్, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, విద్యుత్ ఫోల్స్, మెయిన్ టాయిలెట్స్, క్యాంటీన్ టాయిలెట్స్, ప్లంబింగ్, జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పాయింటింగ్ పనులు చేపట్టారు. మరోవైపు రూ.50 లక్షలతో పార్కులోని ఫౌంటెయిన్ల సముదాయాలను పూర్తిగా ఆధునీకీకరించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడే ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహంతోపాటు డాల్ఫిన్స్, వివిధ రకాల కళాఖండాలను ఏర్పాటు చేశారు. దీంతో పూర్తిస్థాయిలో రూపుమార్చుకున్న శివాజీ పార్కు సందర్శకులను అబ్బురపరచడంతోపాటు ఆహ్లాదం పంచుతోంది.

\- ఎంవీపీ కాలనీ


ఆకర్షణీయంగా పార్కు ఎలివేషన్


గతంలో శిథిలావస్థలో ఉన్న శివాజీపార్కులోని ఫౌంటెయిన్ సముదాయం


అధునాతనంగా తీర్చిదిద్దిన టాయిలెట్స్


విభిన్న విగ్రహాలతో ఫౌంటెయిన్ సముదాయం

ప్రతిధ్వనించిన పంచాక్షరి


కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


ప్రత్యేక అలంకరణలో శివలింగం


ఆరిలోవ శివాజీనగర్-2 శివాలయంలో అన్నాభిషేకం చేస్తున కార్పొరేటర్ సునీత


పార్వతీ ముక్తీశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


జ్యోతిర్లింగాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: ఓం నమశ్శివాయ అన్న పంచాక్షరితో శివాలయాలు ప్రతిధ్వనించాయి. కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పిఠాపురం కాలనీలోని రామలింగేశ్వస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయం, హెచ్‌బీ కాలనీ, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోటలో శివాలయాల్లో నీలకంఠుడికి భక్తులు నీరాజనాలు సమర్పించారు.

➡ కాశీ విశ్వేశ్వరాలయంలో ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తులు దీపాలు వెలిగించి, పూజలు చేశారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు సీహెచ్.జ్యోతి, దుంపా రవి, కె.అప్పారావు, పోతన్నరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పార్వతీ ముక్తీశ్వరుడికి నీరా'జనం'

ఎంవీపీ కాలనీ: కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలోని శ్రీ సిద్ధి వినాయక పార్వతీ ముక్తీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి మహాదేవుడిని మనసారా అర్చించారు. ఉదయం నుంచి దీపారాధన, క్షీరాభిషేకం, ఏకవారాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలకు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని తులసి కోట, ధ్వజస్తంభం, నందీశ్వరుడి వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

మహాదేవుడికి అన్నాభిషేకం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్-2 శివాలయంలో జ్యోతిర్లింగాలకు కార్పొరేటర్ కెల్ల సునీత భక్తులతో కలసి అన్నాభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో కార్పొరేటర్ పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. ఆపరేషన్ కాలనీ, నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ, రవీంద్రనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, పెదగదిలి, విశాలాక్షి నగర్ శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆకట్టుకున్న 'మాక్ పార్లమెంట్'


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: విద్యార్థులకు చట్టసభల నిర్వహణపై అవగాహన అవసరమని డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు అన్నారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం మాక్ పార్లమెంట్ అండ్ ఆర్ట్ క్రాఫ్ట్ గ్యాలరీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టిన విధానాన్ని బీఏ విద్యార్థులకు నమూనా పార్లమెంట్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులుగా ఎదగాలనుకునే విద్యార్థులకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, శ్రావణ్‌కుమార్, పి.ధనలక్ష్మి, పద్మ, తేజస్వి, పి.ఉమామహేశ్వరరావు, శామ్యూల్ డేవిడ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కులగణన చేపట్టాలి

ఆనందపురం : బీసీలకు ఎంతో ఉపయోగకరమైన కుల గణనను కేంద్రం చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు డిమాండ్ చేశారు. మండలంలోని గంభీరంలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం పథకాలు అమలు చేయాలన్నారు. బీసీలను ఓటర్లుగా చూస్తున్నారు గానీ వారు సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా కర్రి ధనుంజయనాయుడు, గౌరవాధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి నాయుడును సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమ్మర క్రాంతి కుమార్, ఎన్ని శ్రీనివాసరావు, పల్లి శ్రీనివాసనాయుడు, పల్లా రమణ పాల్గొన్నారు.

ఐఐఎంవీతో సిడ్బీ ఎంవోయూ


ఒప్పంద పత్రాలు చూపుతున్న సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నంతో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిడ్బీ) అవగాహన ఒప్పందం చేసుకుంది. మిషన్ స్వావలంబన్‌లో భాగంగా స్కిల్ టు ఎంటర్‌ప్రైజ్ మోడల్ (స్టెమ్) అమలుపరిచేందుకు రెండు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. దీనిలో భాగంగా స్టెమ్ ప్రోగ్రాంలో ఐఐఎం విశాఖపట్నం నూతన పీజీ సర్టిఫికెట్ కోర్సులను అందిస్తుంది. ఐఐఎంవీ-సిడ్బీల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు నూతన వ్యాపారాలు ప్రారంభించే దిశగా, నవ్య ఆలోచనలతో పనిచేసే దిశగా సహకారం అందిస్తారు. అకడమిక్ ప్రోగ్రాములతో పాటు, ఇంక్యుబేషన్-మెంటారింగ్ ఫేజ్‌లు కలిగి ఉంటాయి. కార్యక్రమంలో ఐఐఎంవీ సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, సిడ్బీ సీజీఎం డాక్టర్ సుభాన్షు శేఖర్ ఆచార్య, జీఎం ప్రభాకర్ ప్రవీణ్ కుమార్, విశాఖ ఏజీఎం జి.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'కట్టమంచి'

- ఆయన రచనలు అజరామరం
- సాహిత్యగోష్టిలో ఆచార్యుల నివాళి


కట్టమంచి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

ఏయూక్యాంపస్: దార్శనికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి అని వక్తలు కొనియాడారు. కట్టమంచి జయంతిని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు విభాగం , సమైక్య భారతి సంయుక్త నిర్వహణలో సోమవారం సాహిత్యగోష్టి నిర్వహించారు. తెలుగు విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా కట్టమంచి చిత్రపటానికి ఆచార్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి పి.కన్నయ్య మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకుడన్నారు.ఆయన రాసిన ముసలమ్మ మరణం తెలుగు సాహితీ చరిత్రలో అజరామరంగా వెలుగొందే అద్భుత కావ్యకళాసృష్టిగా కొనియాడారు.

సీనియర్ ఆచార్యుడు ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని నూతన దృక్పథంతో ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు నడిచిన అభ్యుదయవాది అని కొనియాడారు. ఆయన ఉపన్యాసాల్లో విషయ పరిజ్ఞానం, సమయస్ఫూర్తి, వాగ్ధాటి, హాస్య చతురత కనిపిస్తుందని, విదేశీయులు సైతం మంత్రముగ్ధులయ్యేవారని తెలియజేశారు. కట్టమంచి రామలింగారెడ్డి ఏ పదవి చేపట్టినా ఆ పదవికే వన్నె తెచ్చిన మంచి పరిపాలనాదక్షుడన్నారు. కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వం-వివేచన అనే అంశంపై డాక్టర్ ఎల్.బి కళాశాల విశ్రాంతాచార్యులు డాక్టర్ మరడాన సుబ్బారావు, కట్టమంచి రామలింగారెడ్డి జీవితం-పరిచయం అంశంపై ఏవీఎన్ కళాశాల విశ్రాంతాచార్యులు డాక్టర్ ఎస్.పోలయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్

- అందుకే ఆయనే మళ్లీ సీఎం కావాలనేది ప్రజల ఆకాంక్ష
- వైఎస్సార్‌సీపీ 'తూర్పు' ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు


22వ వార్డులో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు


సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో పేదల సంక్షేమ కోసం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 22వ వార్డులో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

28వ వార్డులో.. : జీవీఎంసీ 28వ వార్డులో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు పార్టీ జెండాను ఎగరవేశారు. సచివాలయ పరిధిలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తృతంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఎంవీపీ కాలనీ: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' ('వై ఏపీ నీడ్స్ జగన్') కార్యక్రమం జీవీఎంసీ 17వ వార్డు పరిధి ఎంవీపీ కాలనీలో కార్పొరేటర్ గేదెల లావణ్య పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. దలైవారి వీధిలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం రాష్ట్రానికి ఎందుకు కావాలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. తొలుత పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు మొల్లి అప్పారావు, నాయకులు గేదెల నాగరాజు, సత్యవతి, జోషిలా, లవణకుమార్ పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివైడర్ దాటుతున్న మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నానికి చెందిన బోని పద్మ(38) కార్తిక సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భవానీపురం బాల భాస్కర్ నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. కార్తిక సోమవారం కావడంతో ఉదయం 5.15 గంటల సమయంలో పద్మ తన వదిన పైడి రాజమ్మతో కలిసి దుర్గగుడికి బయలుదేరింది. కనకదుర్గ ఫ్లైఓవర్ వద్ద డివైడర్ దాటుతుండగా వేగంగా వచ్చిన కారు పద్మను ఢీ కొట్టింది. తలకు బలమైన గాయమై పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది.